## రేషన్ బియ్యం పంపిణీలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

- సూర్యాపేట ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట సిటీ, జనవరి 18 : రేషన్ బియ్యం సరఫరా, పంపిణీలో అక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని సూర్యాపేట జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే హెచ్చరించారు. గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ అక్రమ రవాణాను అరికట్టేందుకు సంబంధిత అధికారుల సమన్వయంతో నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. బియ్యం అందించే మిల్లర్లపై, అంతర్రాష్ట్ర రవాణాపై నిఘా ఉన్నదని తెలిపారు. ప్రభుత్వ లక్ష్యం నెరవేరడానికి రేషన్ డీలర్లు, మిల్లర్లు బాధ్యతగా పని చేయాలని సూచించారు. రేషన్ బియ్యాన్ని లబ్ధిదారుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి బహిరంగ మార్కెట్‌లో ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు సమాచారం ఉన్నదన్నారు. అక్రమార్కులపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. రేషన్ డీలర్లు, మిల్లర్లపై, అంతర్రాష్ట్ర సరిహద్దు, పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉంచామని తెలిపారు. అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వ పథకాలను పక్కదారి పట్టించినా, ప్రజల ఆహార భద్రతకు భంగం కలిగించినా పీడీ యాక్టు నమోదు చేస్తామని ఎస్పీ హెచ్చరించారు.

## రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో జిల్లా బాలికల జట్టు విజయం



స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జనగామలో జరిగిన అండర్-14 రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లా బాలికల జట్టు ప్రథమ బహుమతి కైవసం చేసుకున్నది. గురువారం నిర్వహించిన ఫైనల్ పోటీల్లో వరంగల్ జిల్లా జట్టుపై 48-42 స్కోరుతో విజయకేతనం ఎగురవేసింది. బాలుర విభాగంలో జిల్లా జట్టు ఫైనల్‌లో ఓడి ద్వితీయ బహుమతి గెలుచుకున్నది. విజేతలకు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. – జనగామ, జనవరి 18

# సాగు సగమే

## ప్రాజెక్టుల్లో నిండుకుంటున్న నీటి నిల్వలు

## యాసంగిపై ఆసక్తి చూపని రైతులు

- వర్షాభావ పరిస్థితులతో పడిపోతున్న భూగర్భ జలాలు
- ఈ ఏడాది 18.6 శాతం లోటు వర్షపాతం
- ఈ సీజన్‌లో 5.81 లక్షల ఎకరాల్లో సాగు అంచనా.. ఇప్పటివరకు అయ్యింది 3 లక్షలే..
- ఈ నెలాఖరుతో ముగియనున్న సాగు ప్రణాళిక
- పంటలు చేతికొచ్చే వరకు నీటి నిల్వలు ఉండకపోవచ్చని రైతుల ఆందోళన



పానగల్‌లో పొలంలో నాట్లు వేస్తున్న కూలీలు

నల్లగొండ, జనవరి 18 : యాసంగి సాగు ప్రణాళిక గాడి తప్పుతున్నది. గడిచిన తొమ్మిదేండ్లుగా రెండు సీజన్లలో పచ్చని పంటలు పండగా ఈ సారి వర్షాభావ పరిస్థితుల కారణంగా వ్యవసాయ శాఖ అంచనాలు మారుతున్నాయి. యాసంగి సీజన్‌లో నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 5.81లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు అవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేసినప్పటికీ ఇప్పటి వరకు 2.99 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగు అయ్యింది. ఈ నెల చివరి నాటికి యాసంగి సీజన్ ముగియనున్న నేపథ్యంలో మరో 50వేల ఎకరాలకు మించి సాగు అయ్యే అవకాశం కనిపించడం లేదు. దీనికి కారణం సాగర్ ప్రాజెక్టులో నీరు లేనందున ఎడమ కాల్వతోపాటు ఏఎంఆర్పీ కెనాల్ కింద ఉన్న ఆయకట్టు పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. వీటి కిందనే మెజారిటీ సాగు భూములు ఉండగా అక్కడక్కడ బోర్లు ఉన్న రైతులతోపాటు నాన్ ఆయకట్టు రైతులు సాగు చేయడంతో ఆ మాత్రం పంటలు సాగు అవుతున్నాయి. ప్రస్తుతం బోర్లలో కనీస నీటి నిల్వలు ఉండగా పొట్ట దశలో ఆ నీళ్లు ఏ మేరకు సరిపోతాయోనని అన్నదాతలు ఆందోళనలో చెందుతున్నారు.

### 2.79 లక్షల ఎకరాల్లో వరి సాగు

సాధారణంగా యాసంగి సీజన్ నవంబర్-15 నుంచి ప్రారంభం అయినప్పటికీ మార్చి లేదా ఏప్రిల్ నాటికి పంట చేతికి వస్తుంది. ఈ సారి మరో పది రోజులైతే జనవరి నెల పూర్తి అవుతున్నా జిల్లా వ్యాప్తంగా 5.81 లక్షల ఎకరాలకు 2.99 లక్షల ఎకరాలు మాత్రమే సాగు అయ్యింది. సాగు ప్రణాళిక ప్రకారం 5.55 లక్షల ఎకరాల్లో వరి, 20వేల ఎకరాల్లో వేరుశనగ, ఆరు వేల ఎకరాల్లో జొన్న, మొక్క జొన్న, ఆముదం, మినుము, బొబ్బర, పెసర పంటలు సాగు చేస్తారని అంచనా వేశారు. ఇప్పటి వరకు 2.79లక్షల ఎకరాల్లో వరి, 16వేల ఎకరాల్లో వేరుశనగ, నాలుగు వేల ఎకరాల్లో ఇతర పంటలు సాగు చేశారు. ఈ నెల చివరి నాటికి 60శాతం మాత్రమే సాగయ్యే అవకాశం ఉన్నది.

### ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు లేకపోవడంతోనే..

యాసంగి సీజన్‌లో సాగు అంచనాలు తగ్గడానికి ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు లేక పోవడమే కారణం. వర్షాభావ పరిస్థితులతో చెరువులు కూడా నిండలేదు. దాంతో భూగర్భ జలాలు గణనీయంగా పడిపోతున్నాయి. నాగార్జున సాగర్‌తోపాటు ఆ ప్రాజెక్టులో అంతర్భాగమైన ఏఎంఆర్పీ కింద ఎక్కువగా వరి సాగు చేస్తారు. సాగర్ ఎడమకాల్వ కింద 1.80 లక్షల ఎకరాల ఆయకట్టు ఉండగా ఈ సారి బోరు బావులను నమ్ముకొని 30వేల ఎకరాలకు మించి సాగు చేయని పరిస్థితి. 2.20 లక్షల ఎకరాల ఆయకట్టు ఉన్న ఏఎంఆర్పీ హైలెవల్, లోలెవల్ ప్రాజెక్టుల్లో కూడా నీటి నిల్వలు లేవని, నీటిని విడుదల చేయలేమని అధికారులు ఇప్పటికే ప్రకటించడంతో అక్కడా సగం మేర మాత్రమే సాగు అవుతున్నాయి. ఏఎంఆర్పీ ప్రాజెక్టు పరిధిలో ఎక్కువగా బోర్లు ఉండటం వల్ల సాగు చేస్తున్నప్పటికీ చివరి పొలాల వరకు నీళ్లు పారుతాయా లేదోనని ఆందోళనలో రైతాంగం ఉన్నది. ఇక మూసీ కింద మాత్రం 30వేల ఎకరాల్లో వరి సాగు అవుతున్నది.

### 14 మండలాల్లో లోటు వర్షపాతం

నల్లగొండ జిల్లాలో 651.4 మిల్లీమీటర్ల వర్షం పడాల్సి ఉండగా 530.4 మిల్లీమీటర్లు పడింది. 18.6శాతం లోటు వర్షపాతం నమోదైంది. ఇక జిల్లాలో 32 మండలాలకు గానూ 28 మండలాల్లో సాధారణ వర్షపాతం పడగా 14 మండలాల్లో లోటు వర్షపాతం ఉన్నది. ప్రస్తుతం 32 మండలాల్లో భూగర్భ జలాలు పడిపోతుండగా మరో రెండు నెలల్లో అడుగంటిపోయే పరిస్థితి కనిపిస్తున్నది.

### ఈ నెల చివరి వరకు సాగయ్యే అవకాశం

ఈ సారి ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు లేనందున ఆ నీటిపై ఆధార పడ్డ రైతులు సాగు చేయడం లేదు. బోరు బావులపై ఆధార పడ్డ రైతులు మాత్రమే ఎక్కువగా సాగు చేస్తున్నారు. జిల్లాలో ఎక్కువగా వరి వేస్తున్నారు. ఇప్పటి వరకు మూడు లక్షల ఎకరాల్లో పంటల సాగు కాగా ఈ నెల చివరి నాటికి పెరిగే అవకాశం ఉన్నది.

– శ్రవణ్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి, నల్లగొండ



చివ్వెంల : వట్టిఖమ్మంపహాడ్‌లో రైతు రాఘవరావు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

## కార్యకర్తలకు అండగా ఉంటాం

- ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

చివ్వెంల, జనవరి 18 : నాయకులు, కార్యకర్తలకు బీఆర్‌ఎస్ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని సూర్యాపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. చివ్వెంల మండలం వట్టిఖమ్మంపహాడ్, అక్కలదేవిగూడెంలో ఇటీవల మృతి చెందిన మాజీ సర్పంచ్ రౌతు రాఘవరావు, రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పుట్టా సైదులు కుటుంబాలను ఆయన పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు జూలకంటి జీవన్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు రావిచెట్టు సత్యం, సర్పంచ్ పుట్టా గురువేందర్, మాజీ ఎంపీపీ రౌతు నర్సింహారావు, ధరావత్ బాబునాయక్, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ దస్తగిరి, పబ్బు సైదులు ఉన్నారు.

### కార్మిక సంఘం అధ్యక్షుడికి నివాళి

ఆత్మకూర్.ఎస్ : మండలంలోని దాచారం గ్రామానికి చెందిన కార్మిక సంఘం అధ్యక్షుడు అల్లి వెంకన్న అయ్యప్ప మాల ధరించి శబరిమల దర్శనానికి వెళ్లి అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన మృతదేహానికి ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట జడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ కొణతం సత్యనారాయణరెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు మర్ల చంద్రారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు తూడి నరసింహారావు, బత్తుల రాజేంద్రప్రసాద్, బొల్లె జానయ్య, తంగెళ్ల మధుసూదన్‌రెడ్డి ఉన్నారు.

## అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలి

- సూర్యాపేట కలెక్టర్ వెంకట్రావ్



వెబ్ ఎక్స్‌లో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావ్, అదనపు కలెక్టర్ ప్రియాంక

సూర్యాపేట, జనవరి 18 : గ్రామపంచాయతీలు, మండలాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసి వెంటనే అందించాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ అన్నారు. కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్ ప్రియాంకతో కలిసి ఎంపీడీఓలు, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులతో గురువారం వెబ్ ఎక్స్ ద్వారా మాట్లాడారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల ద్వారా వివిధ పథకాలకు వచ్చే నిధుల సమాచారాన్ని సమగ్రంగా తయారు చేసి వాటితో చేయాల్సిన అభివృద్ధి పనులకు ప్రణాళికలు తయారు చేయాలన్నారు. మండల స్పెషల్ ఆఫీసర్ల ఆధ్వర్యంలో ఎంపీడీఓలు, ఎంపీఓలు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో మండల పరిషత్ కార్యాలయంలో శనివారం శిక్షణ నిర్వహించాలని సూచించారు. గ్రామ సర్పంచుల ఆధ్వర్యంలో ఈ నెల 20న మొదటి గ్రామ సభ, 25న రెండో గ్రామ సభ నిర్వహించి ఈ నెల 27నాటికి ఈ-గ్రామ్ స్వరాజ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ నెల 31లోగా అన్ని పూర్తి చేసి మండల పరిషత్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించి మండల ప్రణాళికలకు ఆమోదం తెలుపాలని పేర్కొన్నారు. నిర్ణీత వ్యవధిలో అన్ని ఆమోదాలు తెలుపుకొని ఫిబ్రవరి 6వ తేదీలోపు సంబంధిత ఈ-గ్రామ్ స్వరాజ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసుకోవాలన్నారు. ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేస్తూ ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. ఈ నెల చివరి వరకు గ్రామాల్లో వంద శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ సురేశ్, డీఆర్‌డీఓ కిరణ్‌కుమార్, డీపీఓ యాదయ్య, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బీజేపీ జిల్లా నూతన అధ్యక్షుల నియామకం

- నల్లగొండకు నాగం వర్షిత్ రెడ్డి, సూర్యాపేటకు బొబ్బ భాగ్యరెడ్డి

నల్లగొండ ప్రతినిధి, జనవరి18(నమస్తే తెలంగాణ) : బీజేపీ పార్టీ ప్రక్షాళనపై దృష్టి సారించింది. అందులో భాగంగా జిల్లా అధ్యక్షులను మార్చివేసింది. జిల్లాలకు నూతన అధ్యక్షులను నియమిస్తూ గురువారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసింది. నల్లగొండ జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి, సూర్యాపేట జిల్లాకు బొబ్బ భాగ్యరెడ్డి, యాదాద్రిభువనగిరి జిల్లాకు పాశం భాస్కర్‌ను నియమిస్తున్నట్లు ప్రకటించింది. అయితే వీరి నియామకంపై పార్టీలోని సీనియర్స్, శ్రేణుల స్పందన ఎలా ఉంటుందనేది ఆసక్తికరంగా మారింది.



స్వాతంత్ర్య సమర యోధుడు రేపాల సత్యనారాయణ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి

## ఆదర్శనీయుడు రేపాల

- శాసన మండలి చైర్మన్ గుత్తా నివాళి

నల్లగొండ, జనవరి 18 : స్వాతంత్ర్య సమర యోధుడు రేపాల సత్యనారాయణకు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి నివాళులర్పించారు. సత్యనారాయణ సంస్మరణ సభ గురువారం నల్లగొండ పట్టణంలోని పోలీస్ ఆడిటోరియంలో జరిగింది. ఈ కార్యక్రమానికి గుత్తా సుఖేందర్ రెడ్డి హాజరై మాట్లాడారు. నకిరేకల్ మండలం మంగలపల్లిలో వ్యవసాయం కుటుంబంలో జన్మించిన రేపాల సమాజ సేవ కోసం ఎంతో కృషి చేశారన్నారు. పెత్తందారి వ్యవస్థ, బానిసత్వంపైన, కమ్యూనిస్టు భావాలతో ఆయన పోరాటం చేశారని గుర్తు చేశారు. రేపాల ఆదర్శనీయుడని, ఆయన ఆశయ సాధన కోసం కృషిచేయాలని గుత్తా సూచించారు.

## పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించండి

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ఎమ్మెల్యే బాలూనాయక్ వినతి



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసిన ఎమ్మెల్యే బాలూనాయక్

కొండమల్లేపల్లి, జనవరి 18 : దేవరకొండ నియోజకవర్గంలోని పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తి చేయాలని ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కోరారు. గురువారం హైదరాబాద్‌లో ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా బాలూనాయక్ మాట్లాడుతూ దేవరకొండ నియోజకవర్గంలోని నక్కలగండి, డిండి ఎత్తిపోతల కింద చేపట్టిన సింగరాజుపల్లి, కిష్టరాయినిపల్లి, శివన్నగూడెం, గొట్టిముక్కల, పెండ్లిపాకల రిజర్వాయర్లకు నిధులు కేటాయించాలని కోరారు. అందుకు సానుకూలంగా స్పందించిన డిప్యూటీ సీఎం త్వరలో పెండింగ్ ప్రాజెక్టుల పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట దేవరకొండ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

## లోక్‌సభ ఎన్నికలకు సన్నద్ధం కావాలి

- బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్



కోదాడ నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్

కోదాడ, జనవరి 18 : అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికి గల కారణాలను సమీక్షించుకొని.. లోక్‌సభ ఎన్నికలకు పక్కా ప్రణాళికతో సన్నద్ధం అవుదామని బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కోదాడ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యకర్తలు అధైర్య పడొద్దు.. తాను వెన్నంటి ఉంటానని భరోసా ఇచ్చారు. నియోజకవర్గ ప్రజలకు, కార్యకర్తలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. ఎన్నికల తర్వాత జరుగుతున్న పరిణామాలను ప్రజలు గమనిస్తున్నారని, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసింది మనమేనని పేర్కొన్నారు. మల్లన్న యువసేన ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేశామని, ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగుతుందని చెప్పారు. మన పార్టీకి బలమైన నాయకులు, అద్భుతమైన నాయకత్వం ఉన్నదని, ఎవరూ నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదని అన్నారు. పార్టీకి అన్ని వర్గాలు దగ్గరయ్యేలా కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు. పదవిలో ఉన్నా, లేకపోయినా నియోజకవర్గ ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు ఎళ్లవేళ్లలా అందుబాటులో ఉంటానని, వారి కష్టసుఖాల్లో భాగస్వామ్యం అవుతానని అన్నారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకుడు పైడిమర్రి సత్యంబాబు, ఆయా మండలాల అధ్యక్షులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## 5వ తరగతిలో గురుకుల ప్రవేశాలకు దరఖాస్తులు

భువనగిరి అర్బన్, జనవరి 18 : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ప్రతిభ పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని భువనగిరి సాంఘిక సంక్షేమ ప్రతిభ పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీరాం శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 20వ తేదీలోపు రూ.100 చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఫిబ్రవరి 11న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జిల్లాలో ఎంపిక చేసే కేంద్రాల్లో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. పరీక్షలో తెలుగుకు 20 మార్కులు, మెంటల్ ఎబిలిటీకి 10, ఇంగ్లిష్‌కు 25, ఈవీఎస్‌కు 20, మ్యాథ్స్‌కు 25 మార్కులు కలిపి మొత్తం 100 మార్కులతో కూడిన ప్రశ్నపత్రం ఉంటుందని చెప్పారు.

### ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి..

తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల ప్రతిభ కళాశాల (సీఓఈ)లో 2024-25 విద్యాసంవత్సరానికి ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఈ నెల 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీరాం శ్రీనివాస్ తెలిపారు. మరిన్ని వివరాలకు ఆన్‌లైన్ వెబ్‌సెట్ www. tswreis.ac.in లేదా3 https// tswreisjc.cgg.gov.in సంప్రదించాలని సూచించారు. అర్హులైన విద్యార్థులు వెబ్‌సైట్ ద్వారా రూ.200 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

## 20న జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష

భువనగిరి అర్బన్, జనవరి 18 : ఈ నెల 20న జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు డీఈఓ కె.నారాయణరెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు జిల్లాలో 5 సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని, ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. భువనగిరిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల గంజ్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల జూనియర్ కళాశాల, మోత్కూర్, రామన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కళాశాల, యాదగిరిగుట్ట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష హాలులోకి అనుమతి ఉండదని, విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

## మైనారిటీ గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు



హుజూర్‌నగర్‌లోని మైనారిటీ గురుకుల పాఠశాల

హుజూర్‌నగర్, జనవరి 18 : 2024-25 విద్యా సంవత్సరంలో తెలంగాణ రాష్ట్ర మైనారిటీ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నెల 18నుంచి ఫిబ్రవరి 6వరకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలి. 5వ తరగతిలో కొత్త సీట్లకు, 6, 7, 8 తరగతుల్లో (కేవలం మైనారిటీ) ఖాళీలకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. మైనారిటీ గురుకుల జూనియర్ కళాశాలల్లో బాలికలు, బాలురు సీట్ల కోసం ఇదే తేదీల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

### దరఖాస్తుకు వీరు అర్హులు

గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు కుటుంబ వార్షిక ఆదాయం రూ.2లక్షలకు మించరాదు. సీట్లను లక్కీ డిప్ పద్ధతిలో ఎంపిక చేసి ప్రవేశాలు కల్పిస్తారు. సందేహాల నివృత్తి కోసం హైదరాబాద్‌లోని హెల్ప్ లైన్ కేంద్రం 040-23437909 ఫోన్ నంబర్‌కు చేయవచ్చు. http://tmreis. telangana.gov.in వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలు తెలుసుకోవచ్చు. నల్లగొండ బాలుర పాఠశాల 9490895916, దేవరకొండ బాలుర 7331170859, నల్లగొండ జూనియర్ కళాశాల 9959709588, నకిరేకల్ పాఠశాల 7207998960 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని నల్లగొండ జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి టి.విజయాందర్‌రెడ్డి, ఆర్‌సీఓ విష్ణు సంయుక్త ప్రకటనలో తెలిపారు.

### ఉమ్మడి జిల్లాలోని పాఠశాలలు

బాలికల కోసం హుజూర్‌నగర్, కోదాడ, నల్లగొండ, ఆలేరు, మిర్యాలగూడ, నకిరేకల్, బాలుర కోసం నల్లగొండ, భువనగిరి, సూర్యాపేట, చౌటుప్పల్, దేవరకొండ, తుంగతుర్తి, అనుముల పాఠశాలలు ఉన్నాయి. ఐదో తరగతిలో మైనారిటీ విద్యార్థులకు 60, బీసీలకు 10, ఎస్సీలకు 5, ఎస్టీలకు 3, ఓసీలకు 2, ఇంటర్ మొదటి సంవత్సరంలో మైనార్టీలకు 60, బీసీలకు 5, ఎస్సీలకు 2, ఓసీలకు 1 చొప్పున సీట్లను కేటాయించారు.

## 21న ఉమ్మడి జిల్లా ఖోఖో జట్ల ఎంపిక

భువనగిరి కలెక్టరేట్, జనవరి 18 : ఉమ్మడి నల్లగొండ జిల్లా సీనియర్ మహిళల, పురుషుల ఖోఖో జట్లను ఈ నెల 21న భువనగిరిలోని ఇండోర్ స్టేడియంలో ఎంపిక చేయనున్నట్లు ఉమ్మడి జిల్లా ఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాతి కృష్ణమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన యాదాద్రి భువనగిరి, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల క్రీడాకారులు ఒరిజినల్ ఆధార్ కార్డుతో ఉదయం 10 గంటలకు భువనగిరిలోని ఇండోర్ స్టేడియం వద్దకు రావాలని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఫిబ్రవరి నెలలో యాదాద్రి భువనగిరి జిల్లాలో జరిగే 56వ సీనియర్ రాష్ట్ర స్థాయి చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పూర్తి వివరాలకు పి.రమేశ్‌రెడ్డి-9963085686, పి.ఆంజనేయులు-9848825255, ఎస్.పవన్ -9390330601, పి.శ్రీశైలం -9000690244 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## 'పది'లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

- నల్లగొండ జిల్లా విద్యాశాఖ అధికారి భిక్షపతి

చిట్యాల, జనవరి 18 : జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో లక్ష్య కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి పదో తరగతి వార్షిక పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని నల్లగొండ జిల్లా విద్యాశాఖ అధికారి భిక్షపతి సూచించారు. గురువారం చిట్యాలలోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలతోపాటు భవిత కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థుల సామర్థ్యాన్ని తెలుసుకునే ప్రయత్నం చేశారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ తొలిమెట్టు కార్యక్రమాన్ని కచ్చితంగా అమలు చేయాలని, విద్యార్థులకు చదువడం, రాయడం నేర్పించి ప్రతి విద్యార్థి గణిత ప్రక్రియలు చేసేలా చూడాలన్నారు. భవిత కేంద్రంలో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయులు కరుణాకర్‌రెడ్డి, స్లీవమ్మ, భవిత కేంద్రం ఉపాధ్యాయురాలు గీత ఉన్నారు.

VIPASSANA EDUCATIONAL TRUST
HETERO INSTITUTE OF PHARMACEUTICAL SCIENCES
(Sai Spurthi Institute of Technology Campus)
B.Gangaram, Sathupally, Khammam District, Telangana - 507 303.
Mail ID : hipsr.principal@gmail.com
WANTED
1. Principal 2. Asso.Professors 3. Asst.Professors
4. Lab Technicians 5. Office Staff & Attenders
Interested and Qualified persons can send their resumes on or before 20.01.2024 by 5PM at the above address with all certificates and testimonials
Departments : Pharmaceutics, Pharmaceutical Chemistry, Pharmaceutical Analysis, Pharmacology & Pharmacognosy
Experience and salary will be as per the PCI norms.
Secretary & Correspondent
Vipassana Educational Trust
Date : 17.01.2024